క్లుప్తంగా

మత్తుతో జీవితాలు చిత్తు



వినుకొండ: పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు వినియోగం వలన కలిగే నష్టాలు, మాదకద్రవ్యాలతో పట్టుబడినా లేదా వినియోగించినా చట్టపరంగా తీసుకొనే చర్యల గురించి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకొని బంగారు జీవితాన్ని నిర్మించుకోవాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. ఎక్సైజ్ ఎస్ఐ వినీల, సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, కరస్పాండెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

యోగాలో నాదెండ్ల విద్యార్థుల ప్రతిభ



నాదెండ్ల: యోగాలో నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట శంకరభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవలే డివిజన్‌స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాదెండ్ల జిల్లాపరిషత్ విద్యార్థులు అండర్-14 విభాగంలో సాత్విక్, కార్తీక్, అనూష, అండర్-17లో మహేశ్వరి, వెంకటసాయి ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో వీరు జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు హాజరుకానున్నారు. పీడీ హనిమిరెడ్డి, పీఈటీ అమీర్‌హుస్సేన్, హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లించాలి

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ



నాదెండ్ల: నిత్యం దైవచింతనలో గడిపే ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ కోరారు. ఈ మేరకు నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం పెంచుతామని హామీఇచ్చిందన్నారు. ఏడాది పైగా గడుస్తున్నా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవటంతో పేదరికంలో ఉన్న ఇమామ్, మౌజన్‌లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే గౌరవ వేతనాన్ని చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు.

యోగా పోటీలకు 'ధనలక్ష్మి' విద్యార్థి ఎంపిక



గోపి

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయమా కళాశాలకు చెందిన శివరాత్రి గోపి (ప్రథమ ఎంపీఈడీ విద్యార్థి) ఫిజికల్ ఎడ్యుకేషన్ పోటీలల్లో యోగా పురుషుల జట్టుకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకరావు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల పోటీలల్లో ఎంపికైనట్లు తెలిపారు. నవంబరు 24 నుంచి వెల్స్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, చెన్నైలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు నాగార్జున విశ్వవిద్యాలయం జట్టు తరపున పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు అధ్యాపకులు ఆర్.బలరాం, అరవింద్, ఎం.దాసు, సాయిప్రసాదులు అభినందించారు.

సీజేఐ గవాయిపై దాడికి నిరసన



అమరావతి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ భూషణ్ రామ కృష్ణగవాయిపై లాయర్ రాకేష్ కిషోర్ బూటుతో చేసిన దాడిని ఖండిస్తూ శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. నేతలు దారా ప్రసాద్, తోకల సూరిబాబు, ఉపాధ్యాయుడు గుడిసె దేవరాజు, దాసు, విశ్రాంత ఉపాధ్యాయుడు రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ప్రతిష్టా మహోత్సవం

ఘనంగా హరిహర క్షేత్ర మందిర విగ్రహ ప్రతిష్ట



వేంకటేశ్వర విగ్రహం



ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం



పరమేశ్వర విగ్రహం



ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన హోమం

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన హరిహర క్షేత్ర మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. త్రయాహ్నిక దీక్షా విధానంగా ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. హరిహర క్షేత్ర మందిరంలో వినాయక, వేంకటేశ్వర, పరమేశ్వర, నందీశ్వర, గరుత్మంత విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. వేలాది మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రతిష్ఠ సందర్భంగా చుట్టపక్కాలు, బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది.

యోగాతో జీవితం ఆనందమయం

నరసరావుపేట రూరల్: యోగా ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందని శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకుడు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగా గురూజీ తెలిపారు. రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ ఉచిత యోగ శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర యోగ గురూజీ అనుగ్రహ భాషణం అందించారు. విద్యార్థి దశలోనే యోగా సాధన చేయడం ద్వారా ప్రతిభ కనబర్చడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. 28రోజులు పాటు యోగా తరగతులకు హాజరైన వారికి, శ్లోకాలు అప్పజెప్పిన వారికి ప్రతిభా పురస్కారాలను బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు గురూజీ అందజేశారు. ఎంఏఎం కళాశాలల చైర్మన్ ఎం.శేషగిరిరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ గుంటుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం, నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 189వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ మాట్లాడుతూ యోగా శిక్షణ పూర్తిచేసుకున్న వారు గురుదక్షిణగా రోజుకు 30 నిమిషాలు యోగసాధన చేయాలని తెలిపారు.

బాకీ డబ్బులు అడిగినందుకు దాడి

నరసరావుపేట టౌన్: బాకీ డబ్బులు అడిగినందుకు దాడి చేశారనే బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ శనివారం తెలిపారు. మేడికొండూరు మండలం డోపర్తి గ్రామానికి చెందిన నాగండ్ల ఝాన్సీ నరసరావుపేట కంభంపాలెంలో నివాసం ఉంటున్న తన అక్క కుమారుడు కొండెపోగు దినేష్ కుమార్‌కు రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తిరిగి ఇవ్వకపోవటంతో అడిగేందుకు శుక్రవారం అతని ఇంటి వద్దకు వెళ్లింది. బాకీ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆమెపై దినేష్‌కుమార్, అతని అన్న నరేష్ ఇద్దరు అసభ్యకరంగా దూషించి దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు



వ్యాపారులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు చేకూరే అవకాశం ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో శనివారం నిర్వహించిన జీఎస్టీ ఉత్సవ్‌లో పాల్గొని వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్లాబ్‌ల తగ్గింపు వల్ల ప్రజలకు ఊరట లభించే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. వస్త్రాలు, ఫ్యాన్సీ వస్తువులు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు ధరల తగ్గింపు జరిగితే ప్రజలకు కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ దుకాణంపై కేసు

చిలకలూరిపేటటౌన్: దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్న ఒక దుకాణంపై చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీపావళి మందుల తయారీకి వివిధ శాఖల నుంచి పూర్తిస్థాయి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా అలాంటి నిబంధనలను పాటించకుండా స్థానికంగా తయారు చేస్తుండడాన్ని పోలీసులు తమ తనిఖీల్లో గుర్తించి, సదరు దుకాణంపై కేసు పోలీసులు నమోదు చేశారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



లింగారావుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, చిన్నారులు

నాదెండ్ల: ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావసతులను బాలికలు అందిపుచ్చుకొని ఉన్నత చదువులు చదివి ఎదగాలని జన విజ్ఞాన వేదిక చిలకలూరిపేట డివిజన్ అధ్యక్షుడు ధూళిపాళ్ళ వెంకటరావు చెప్పారు. పోతవరంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జన విజ్ఞాన వేదిక, జ్ఞానేశ్వరి అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బాలికల అభివృద్ధికి అనేక చట్టాలున్నాయని, ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. జేవీవీ ప్రచురించిన ఎదిగే ఆడపిల్లలు ఏం తెలుసుకోవాలి అనే పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ నెల 18న నిర్వహించే స్కూలుస్థాయి చెకుముకి సంబరాలకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. జేవీవీ ప్రధాన కార్యదర్శి బి.అజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, దార్ల బుచ్చిబాబు, చుక్కా విన్సెంట్‌పాల్, గార్స్ ప్రధానకార్యదర్శి బుల్లిబాబు, సతీష్, పాఠశాల ప్రత్యేకాధికారి అఫ్రిపూన్ పాల్గొన్నారు.

లింగారావుపాలెంలో..

యడ్లపాడు: విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని, బాలికలను చక్కగా చదివించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు పున్నమ్మ, అనురాధ చెప్పారు. లింగారావుపాలెం గ్రామంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం శనివారం నిర్వహించారు. చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు ఆడబిడ్డలను చదివించాలని, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచాలన్నారు. బాల్యవివాహాలతో అనర్థాలు, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 4.6 మి.మీ. వర్షపాతం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీవర్షాలు కురిసాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం ఉదయానికి 4.6 ఎం.ఎం. వర్షపాతం నమోదు అయిందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. వర్షం ప్రభావం వల్ల మండలంలోని వాగులు ఓ మోస్తరుగా ప్రవహించాయి. పగటి వేళ వర్షం లేకుండా చల్లని వాతావరణం నెలకొనడంతో వ్యవసాయ పనులు ఆటంకం లేకుండా సాగాయి.

పేకాట స్థావరంపై దాడి

చిలకలూరిపేటటౌన్: మండలంలోని గొట్టిపాడు గ్రామ పొలాల్లో రహస్యంగా పేకాట (కోత ముక్క) ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్, సిబ్బందితో కలిసి గొట్టిపాడు గ్రామ పొలాల్లో నిఘా పెట్టారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,840 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సూచిక బోర్డుకు మోక్షం

ఎట్టకేలకు సాక్షి కథనానికి స్పందించిన రైల్వే అధికారులు

సాక్షి ఎఫెక్ట్



శావల్యాపురం రైల్వేస్టేషన్ సూచిక బోర్డు

శావల్యాపురం: మండల కేంద్రమైన శావల్యాపురం జాతీయ రహదారి వెంబడి ఆర్యవైశ్య వీధిలో నిరుపయోగంగా పడి ఉన్న రైల్వే స్టేషను సూచిక బోర్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. రైల్వే స్టేషన్ సూచిక బోర్డు నిరుపయోగంగా పడి ఉన్న వైనం 'ఉండీ ఉపయోగం లేదు' శీర్షికన ఈనెల 8వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. రోడ్డుపై యధావిధిగా ఉంచేలా చర్యలు చేపట్టారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

14న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో ఈనెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వశాఖల పనితీరుపై ప్రత్యేకంగా చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, అందరు ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, అన్ని గ్రామాల సర్పంచ్‌లు హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



క్రోసూరులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ తులసి, సిబ్బంది

క్రోసూరు: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. స్థానిక నాలుగురోడ్లసెంటర్‌లో స్థానికులతో కలిసి శనివారం కేర్ యాక్టివిటీలో భాగంగా ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో నాటుసారా, డ్రగ్స్, గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ టి.తులసి మాట్లాడుతూ సమాజంలో నాటుసారాయి, డ్రగ్స్, గంజాయి అలవాట్లు చెదపురుగులాంటివని అన్నారు. వీటి బారిన పడినవారి కుటుంబాలు అధోగతి పాలవుతాయన్నారు. ప్రజలు, యువత, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా వీటిని వినియోగిస్తున్నట్లు తెలిసినా, ఎక్కడైనా విక్రయిస్తున్నారని తెలిసినా ఎక్సైజ్‌శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. నాటుసారా, డ్రగ్స్, గంజాయితో పట్టుబడితే కఠిన శిక్షలుంటాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్. సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలో నిర్మిస్తున్న విఘ్నేశ్వర దత్తాత్రేయ సమేత షిర్డీ సాయిబాబా దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు 41 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన దక్షిణామూర్తి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యాన అయ్యప్పలకు నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అయ్యప్పలు, దేవాలయ చారిటబుల్ ట్రస్టు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

వినుకొండ: స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో నియోజకవర్గంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు మాట్లాడుతూ డీలర్లు ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయించరాదని, ఎవరైనా అలా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు బ్లాక్ బర్లీ టుబాకో సాగు చేయకూడదన్నారు. మొక్కజొన్న విత్తన పథకం కింద సాగు చేసే రైతులు సంబంధిత కంపెనీ నుంచి బాండ్ తీసుకున్న తరువాత మాత్రమే మొక్కజొన్న పంట సాగు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ డీలర్లు ఎరువులు డీబీటీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. యూరియా అవసరం మేరకే కొనుగోలు చేయాలన్నారు. ఏడీఏ రవికుమార్, ఏఓలు జి.వరలక్ష్మి, అంకారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

వినుకొండ రూరల్ సీఐ బొప్పున బ్రహ్మయ్య

శావల్యాపురం: శావల్యాపురం పోలీసు స్టేషన్‌ను వినుకొండ రూరల్ సీఐ బొప్పున బ్రహ్మయ్య శనివారం సందర్శించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ బ్రహ్మయ్య విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు విజువల్ పోలీసు విధుల్లో భాగంగా గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో వాహనాలు తనిఖీ చేశామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. శావల్యాపురం ప్రధాన కూడలి గుంటూరు - కర్నూలు రహదారి మార్గంలో స్పీడు బ్రేకర్లు లేకపోవటం వలన వాహనాల అతివేగం వలన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు సీఐ దృష్టికి తెచ్చారు. జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి స్పీడు బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ పోటీలు



విజేతలతో పీఈటీలు

యడ్లపాడు: సొలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు పోటీలను ఎంఈఓ నాగరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అండర్14, 17 బాలబాలికల విభాగాల్లో జరిగిన పోటీల్లో 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, ఖోఖో, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి మండలస్థాయి జట్లను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో అండర్ 17లో లింగారావుపాలెం జెడ్పీహైస్కూలు మొదటిస్థానంలో, సెయింట్ ఆన్స్ రెండో స్థానంలో నిలిచాయి. కబడ్డీలో జగ్గాపురం హైస్కూలు, యడ్లపాడు జెడ్పీ హైస్కూలు, అండర్ 14 వాలీబాల్‌లో వంకాయలపాడు, సొలస విద్యార్థులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.

- బాలికల విభాగం అండర్-17 ఖోఖోలో సొలస హైస్కూలు, యడ్లపాడు సెయింట్ ఆన్స్ మొదటి రెండోస్థానంలో నిలిచాయి. అండర్ 14లో సొలస హైస్కూలు, యడ్లపాడు సెయింట్ ఆన్స్ మొదటి, రెండోస్థానంలో నిలిచాయి. అండర్ 17 వాలీబాల్‌లో సొలస, కారుచోల విద్యార్థులు మొదటి రెండో స్థానంలో నిలిచాయి. పీఈటీలు పుల్లగూర సుధాకర్, కారుచోల మధుబాబు, రాజేష్, శ్రీధర్, శ్రీనివాసరావు, కిషన్, మేరిసారి, అషితూన్, రమాదేవి, వేమారెడ్డి, తనూజ పర్యవేక్షించారు.

మద్యపానం దుష్ఫలితాలపై అవగాహన



అన్నవరంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రొంపిచర్ల: మండలంలోని అన్నవరం గ్రామంలో ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో మద్యపానం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్యం, గంజాయి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యపానం వల్ల కలిగే దుష్ఫలితాలపై గ్రామస్తుల్లో అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్సైజ్ సంబంధిత నేరాలపై సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం రొంపిచర్లలోని నీలకంఠేశ్వర వైన్స్, వి.రెడ్డిపాలెంలోని తిరుమల వైన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడపిల్ల చదువు.. ఇంటికి వెలుగు'



బెల్లంకొండ జెడ్పీ పాఠశాలలో బాలికా దినోత్సవం

బెల్లంకొండ: బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపి, ముందుండాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శాంతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 'హాండ్స్ ఆఫ్ కంపాషన్' సంస్థ ఆధ్వర్యాన అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వివక్ష, సమాజంలో బాలికల పాత్ర అనే అంశాలపై వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం శాంతి మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బాలికలు బాగా చదువుకోవాలని, డ్రాపౌట్స్ లేకుండా ఉండాలని తెలిపారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్ మాట్లాడుతూ బాలికలు వారి హక్కులను గుర్తించాలని, విద్యా, ఆరోగ్యం, బాల్యవివాహాలు, లింగ వివక్ష వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మనోహర్, శామ్యూల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



బాలికలకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నకరికల్లు: బాలికలను చదివిస్తే కుటుంబమంతా విద్యతో విరాజిల్లుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ రమీజున్ అన్నారు. అంతర్జాయ బాలికా దినోత్సవాన్ని నకరికల్లులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను ప్రోత్సహిస్తే సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యానేరమన్నారు. కార్యక్రమంలో కె.విజయలక్ష్మి, ఎం.వి.లక్ష్మి, జి.రాజ్యలక్ష్మి, వి.యలమందమ్మ, వి.మరియమ్మ, ఎస్.సావిత్రి, ఎస్.మాధవి, ఆర్.కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.